సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం, 19, అక్టోబర్, 2023



సంక్షేమం చూసి పార్టీలో చేరుతున్నారు

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చూసి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. -IIలో



రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తున్న బీజేపీ

కృష్ణాజలాల పంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి బీజేపీ రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.150
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 276 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	460	511
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 171.280 కిలోలు

చేదోడు..వాదోడు

కష్టాల్లో కూరుకుపోతున్న కులవృత్తిదారులకు ప్రభుత్వం చేయూతనిస్తోంది. జగనన్న చేదోడు పథకంతో వీరికి అండగా నిలుస్తోంది. దీనికి సంబంధించి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జియో ట్యాగింగ్ సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. పూర్తి పారదర్శకతను పాటించారు.



- అట్టడుగు వర్గాలను ఆదుకుంటున్న 'జగనన్న చేదోడు'
- ఒక్కో కుటుంబానికి రూ. 10 వేలు చొప్పున ఆర్థికసాయం
- జిల్లాలో 12,641 కుటుంబాలకు ప్రయోజనం
- నేడు నాలుగో విడత సొమ్ములు విడుదల

సాక్షి రాయచోటి : రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. ఒకవైపు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తూనే మరోవైపు అందరి సంతోషం కోసం ఆలోచనలు చేస్తోంది. యువతకు ఉద్యోగాలు..నిరుద్యోగులకు స్వయం ఉపాధి..చదువుకుంటున్న వారికి నైపుణ్యం శిక్షణ లాంటి కార్యక్రమాల ద్వారా ఉపాధికి పెద్దపీట వేస్తోంది. ఇంకోవైపు కష్టపడి స్వయం ఉపాధి ద్వారా ముందుకు పోతున్న అణగారిన వర్గాల్లోని వారికి చేదోడు వాదోడుగా ఉండాలని నిర్ణయించుకుంది. ప్రత్యేకంగా కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి నిరుద్యోగులను ఆదుకునే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ వృత్తుల్లో ఉన్న వారిని కూడా ఆదుకునేందుకు అడుగులు పడుతున్నాయి. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందులో భాగంగా వారి కోసం 'జగనన్న చేదోడు' పేరుతో పథకానికి రూపకల్పన చేశారు.

12,641 మందికి రూ. 12.64 కోట్లు

అన్నమయ్య జిల్లాలో నాయీ బ్రాహ్మణ, రజక, టైలర్ వృత్తిలో స్థిరపడిన వారికి సంబంధించి మొత్తాలు అందించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా వరుసగా నాలుగో ఏడాది 12,641 మందికి రూ. 12.64 కోట్ల సొమ్ములను వారి ఖాతాలకు జమ చేయనున్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా అనుకున్న సమయానికే వారికి ప్రభుత్వం ఆర్థిక చేయూతనందిస్తోంది.ప్రతి ఏడాది లబ్ధిదారుల సంఖ్యతోపాటు ఆర్థికసాయం మొత్తం పెరుగుతున్నా ప్రభుత్వం అర్హులైన వారందరికీ అందజేస్తూ వస్తోంది.

ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం టైలర్లు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు సంబంధించి అందిస్తున్న మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి ఏడాది రూ. 10 వేలు చొప్పున ఒక్కో కుటుంబానికి అందిస్తోంది. ఈసారి కూడా అన్నమయ్య జిల్లాలో 12,641 మందికి రూ. 12.64 కోట్ల నిధులను మంజూరు చేయనున్నారు. రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలుజిల్లా ఎమ్మిగనూరు బహిరంగసభ ద్వారా లబ్ధిదారులకు నిధులు విడుదల చేయగానే ఆయా అకౌంట్లకు ఆర్థికసాయం జమ అవుతుంది. అందుకు సంబంధించి అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

– పీఎస్ గిరీషా, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య

ఏడాదికి రూ. 10 వేలు

జిల్లాలోని రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్లకు సంబంధించి ఏడాదికి రూ. 10 వేలు అందించాలని ప్రభుత్వం సంకల్పించి అందిస్తూ వస్తోంది. వీరికి నియమ నిబంధనల ప్రకారం కుటుంబానికి ఒకరిని చొప్పున ఎంపిక చేసి రూ. 10 వేలు అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో పెద్ద ఎత్తున ఆయా వర్గాలకు ఆర్థికసాయాన్ని జగన్ సర్కార్ అందించింది.

జగనన్న చేదోడు కార్యక్రమానికి సంబంధించిన వివరాలు

సంవత్సరం	టైలర్లు/రజకులు/నాయీ బ్రాహ్మణులు (లబ్ధిదారులు)	మంజూరైన మొత్తం (రూ. కోట్లలో)
2020–21	10,123	10.12
2021–22	10,607	10.60
2022–23	12,551	12.55
2023–24 (ప్రస్తుతం)	12,641	12.64

సైబర్ కేటుగాళ్లు

- ఆన్‌లైన్ మోసాలతో డబ్బులు మాయం
- లక్షలు పోగొట్టుకుని తలలు పట్టుకుంటున్న బాధితులు



కడప అర్బన్: డబ్బులు ఎవరికీ ఊరికే రావు.. అన్న సామెత అందిరికీ తెలిసిందే...అయినా కొందరు అత్యాశపరులు ఊరికే వస్తున్నాయంటే ఎగబడుతున్నారు.గుడ్డిగా నమ్మి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. రెట్టింపు డబ్బులు వస్తాయని కొందరు, ప్రైజ్‌మనీ వచ్చిందని మరికొందరు ముక్కూ, ముఖం తెలియని అపరిచిత వ్యక్తుల చేతుల్లో డబ్బులు పెట్టేసి చేతులు కాల్చుకుంటున్నారు. ఒకేఒక్క 'క్లిక్'తో సైబర్ నేరగాళ్ల ఎంచక్కా డబ్బులు కాజేస్తున్నారు. తర్వాత బాధితులు తమ లబోదిబోమంటున్నారు.ఇటీవల కాలంలో అనేక మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి మోసపోవడం ఎక్కువై పోయింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీమణి రూ. 17 లక్షలు పోగొట్టుకున్న వైనం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్య,తన భర్తతో పాటు బెంగళూరులో హాయిగా జీవనం సాగిస్తోంది. ఆమె ప్రెగ్నెంట్ కావడంతో ప్రొద్దుటూరుకు తల్లిదండ్రుల వద్దకు కొద్ది రోజులు ఉండి వస్తాననీ చెబితే పంపించాడు. ఆమె మొబైల్ ఫోన్‌కు సైబర్‌నేరగాడు ఓ లింక్‌ను వాట్సాప్‌కు పంపించాడు. దానిని క్లిక్ చేసిన మహిళకు డబ్బు కడితే ఆఫర్ల క్రింద రెట్టింపు డబ్బులు ఇస్తామనీ చెపాడు. ఆమె తన బంగారు నగలను సైతం బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులను సైబర్‌నేరగాడు చెప్పిన మేరకు తన ఖాతాలో డబ్బులను వేసుకుని పంపించింది. మళ్లీ సైబర్ నేరగాడు ఆమెను మభ్యపెట్టడంతో తన భర్తను బెదిరించి మరో 5 లక్షలను విడతల వారీగా తెప్పించుకుంది. తర్వాత తన భార్య రూ. 17 లక్షలు పోగొట్టుకుందని తెలిసి నిర్ఘాంతపోయాడు. కడప సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు.

పోలీసులకు తలనొప్పిగా మారుతున్న సైబర్ నేరాలు

ప్రస్తుతం పోలీస్‌స్టేషన్లకు వచ్చే కేసుల్లో ఎక్కువగా సైబర్ నేరాలకు సంబంధించినవవే ఉంటున్నాయి. ఈ కేసులను ఛేదించడం పోలీసులకు తలనొప్పిగా మారుతున్నాయి. సైబర్‌నేరగాళ్ల ఫోన్ నంబర్లను ట్రేస్ చేస్తే వాటి అడ్రస్‌లు ఎక్కడో న్యూఢిల్లీ, కర్ణాటక, కాశ్మీర్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించినవిగా ఉంటున్నాయి. ఆధునిక సాంకేతికత, పోలీసు అధికారుల సహకారం ఉన్నప్పటికీ దర్యాప్తు కష్టతరంగా వుంటోంది. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్ల దోచుకున్న డబ్బులను తిరిగి రికవరీ చేయలేని పరిస్థితి నెలకొంది. సైబర్ నేరగాళ్ల తాము దోచుకున్న డబ్బులను రెప్పపాటు కాలంలో తమ పరిధిలోని బంధువులు, స్నేహితుల ఖాతాల్లోకి బదలాయించేస్తున్నారు.

నాలుగు రోజుల్లో రూ.24 లక్షలు పోగొట్టుకున్న ప్రభుత్వ ఉద్యోగి

కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ ఉన్నత శ్రేణి ప్రభుత్వ ఉద్యోగి తన మొబైల్‌కు 'వాట్సాప్'ద్వారా వచ్చిన లింక్ ఆధారంగా డబ్బులు కడితే రెట్టింపు వస్తాయని ఆశ చూపడంతో విడతలవారీగా డబ్బులను చెల్లించాడు. ఏకంగా నాలుగు రోజుల పాటు తన బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరస్తుడికి దాదాపుగా 24 లక్షలు వేశాడు. తన బ్యాంక్ ఖాతానుంచి డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేసిన ప్రతిసారీ బ్యాంక్ రసీదు కూడా రావడంతో తనకు డబ్బులు వస్తాయనే భ్రమతో కడుతూ వెళ్లాడు. తన బ్యాంక్ ఖాతాలోని డబ్బులన్నీ అయిపోగానే అవతల వైపు నుంచి వాట్సాప్, ఇతర యాప్‌ల ద్వారా వచ్చే మెసేజెస్, కాల్స్ నిలిచిపోయాయి. తాను మోసపోయానని గ్రహించిన సదరు ప్రభుత్వ ఉద్యోగి 'స్పందన'కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు. వారి సిఫారసు మేరకు కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనీ పోలీసులు తెలియజేశారు.

న్యూస్‌రీల్

రెండో హరిత విప్లవంగా నానో టెక్నాలజీ

మదనపల్లె: వ్యవసాయంలో సరికొత్త విప్లవానికి నానో ఎరువులు నాంది పలికాయని ఢిల్లీకి చెందిన ఇఫ్కో జీఎం డాక్టర్.ఎం.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో నానో ఎరువులపై ఎఫ్‌పీఓ, సొసైటీ సిబ్బంది, రైతులు, విక్రయదారులకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ..100 కిలోల రసాయన ఎరువు ఒక లీటరు నానో ఎరువుతో సమానమన్నారు. ప్రస్తుతం వ్యవసాయరంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న నానోటెక్నాలజీని రెండో హరితవిప్లవంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో సిబ్బంది యర్రాదిలీప్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు



శబరిమలై స్పెషల్ సర్వీసు బస్సు వద్ద డీటీఓ రాము తదితరులు

మదనపల్లె సిటీ: ప్రయాణికుల సౌకర్యం కోసం దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము పేర్కొన్నారు. బుధవారం స్థానిక వన్‌డిపోలో శబరిమలై యాత్రకు వెళ్లే ప్రత్యేక బస్సు సర్వీసును ప్రారంభించారు. అనంతరం డీటీఓ మాట్లాడుతూ దసరాకు సాధారణ చార్జీలతో బస్సులు నడుపుతున్నామన్నారు. హైదరాబాద్, బెంగళూరుతో పాటు పలు ప్రాంతాలకు నడుపుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు శబరిమలైకు వెళ్లే అయ్యప్పస్వాముల కోసం ప్రత్యేక బస్సులు ప్రారంభించామన్నారు. తిరువణ్ణామలైకు ప్రతి పౌర్ణమికి స్పెషల్ బస్సులు తిప్పుతామని చెప్పారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐ రేవతి,సిబ్బంది పాల్గొన్నారు.

వైవీయూకు ఎన్‌బీఆర్‌ఐ పరిశోధకులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయాన్ని లక్నోకు చెందిన నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా (ఎన్‌బీఆర్‌ఐ) పరిశోధకులు అజయ్‌కుమార్ మిశ్రా, అమిత్‌గుప్తా, హర్షిఫాతిమా సందర్శించారు. దేశవ్యాప్తంగా మొక్కల పరిశోధన, సేకరణలో భాగంగా బుధవారం వైవీయూ బొటానికల్ గార్డెన్‌ను పరిశీలించేందుకు వచ్చారు. అంతరించి పోతున్న మొక్కల సంరక్షణ, మందు మొక్కలను పరిశీలించి అవసరమైన మొక్కలను ఎంపిక చేసుకున్నారు. వాటిని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, గార్డెన్ సంచాలకులు ఆచార్య ఎ.మధుసూధన్‌రెడ్డి చేతుల మీదుగా పరిశోధకులు అందుకున్నారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకోవాలి

కడప కార్పొరేషన్: జిల్లాలో పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపత్యంలో విద్యుత్ అంతరాయాలు ఎక్కువగా ఉన్నాయని, విద్యుత్ సిబ్బంది లైన్లలో తిరిగి సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. బుధవారం కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి మండలాల క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం కడపలోని సాయిపేట సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఒక వినియోగదారుడి ఎల్‌టీ లైన్ పనికోసం రెండువేల మంది వినియోగదారులకు విద్యుత్‌ను అందించే 11కేవీ ఫీడర్‌ను ఆఫ్ చేయడం సరికాదన్నారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ వృధాను అరికడితే సంస్థకు ఆదాయాయన్ని తెచ్చినట్టేనన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అధికారులకు కేటాయించిన లక్ష్యాలను వందశాతం సాధించి జిల్లాకు మంచిపేరు తేవాలని కలెక్టర్ గిరీషా పీఎస్ హెచ్‌ఓడీలకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన జరిగే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌కు అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. జిల్లాలోని హెచ్‌ఓడీలు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. రక్తహీనత లోపం ఉన్న గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి సరియైన పోషకాహారం అందించాలని, రక్తహీనత నివారణకు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు.చిన్న పిల్లలలో బరువు తక్కువ ఉండడం, ఎదుగుదల లోపం వంటి సమస్యలకు ప్రతి అంగన్ వాడీ కేంద్రంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యాశాఖ పరిధిలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియా నూరుశాతం పూర్తి చేయాలన్నారు. 5 నుంచి 18 సంవత్సరాల వయస్సు మధ్య ఉన్న చిన్నారులు బడిలో చేరేలా చూడాలని, ఇందుకోసం మండల ప్రత్యేకాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. పెండింగ్ అప్లికేషన్లు ఒక్కటి కూడా ఉండటానికి వీలు లేదన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఇచ్చిన లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యవిద్య ఉన్నతమైనది

కడప అర్బన్: వైద్య విద్యాభ్యాసం నిరంతరమైనది...సమాజంలో ఉన్నతమైందని కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. 2023–24 వైద్య విద్యను అభ్యసించేందుకు విచ్చేసిన వైద్య విద్యార్థులకు కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఫ్రెషర్స్‌డే, వైట్‌కోట్ వేడుకను 2020 బ్యాచ్ వైద్య విద్యార్థులు బుధవారం ఘనిర్వహించారు. జ్యోతిప్రజ్వలనతో వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ సమాజంలో వైద్యులను ప్రాణదాతలుగా చెప్పుకుంటారని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య విద్యార్థులు ఆరు సంవత్సరాల కాలాన్ని, కళాశాలలోని వసతుల్ని సక్రమంగా వినియోగించుకుంటూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. సహచర విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్స్, అందరితో సఖ్యంగా మెలగాలనీ, స్నేహం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, వైద్యులు వైద్య విద్యార్థుల్ని అభినందిస్తూ, కళాశాలలోని ఆహ్వానించారు. వివిధ విభాగాధిపతులు, విద్యార్థులకు తెల్లకోటు వేసి, వైద్య విజ్ఞాన ప్రపంచంలోకి ఆహ్వానించారు.





ప్రొద్దుటూరు : గజలక్ష్మీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి, దర్శించుకుంటున్న భక్తులు




కడప అమ్మవారిశాలలో గజలక్ష్మిగా వాసవీ కన్యకాంబ

గజలక్ష్మీ నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాల్లో అమ్మవారిని వివిధరూపాల్లో అలంకరించారు. రెండో మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో, కడపలోని అమ్మవారిశాలలో బుధవారం అమ్మవారు గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. – సాక్షి, నెట్‌వర్క్

పదివేలు దాటిన పసుపు ధర



కడప మార్కెట్‌యార్డుకు వచ్చిన పసుపు

కడప అగ్రికల్చర్: పచ్చ బంగారం(పసుపు) ధర క్వింటాల్ రూ. 10 వేలు దాటింది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కడప మార్కెట్‌యార్డులో క్వింటాల్ ఫింగర్ పసుపు అత్యల్ప ధర 9850, అత్యధిక ధర రూ. 10119 పలికింది. బల్బ్ పసుపు అత్యల్ప ధర రూ. 9445, అత్యధిక ధర క్వింటా రూ. 10300 పలికింది.

క్లుప్తంగా

కారును ఢీకొన్న మినీ లారీ



బోల్తా పడిన కారు, మినీ లారీ

రాయచోటి టౌన్ : రాయచోటి–లక్కిరెడ్డిపల్లె రహదారిలో వేగంగా వెళ్తున్న కారును అదుపు చేయలేక డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. వెనుక వస్తున్న మినీ లారీ డ్రైవర్ ఇది గమనించక కారును ఢీకొనడంతో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

తీగల దొంగకు జైలుశిక్ష



ముద్దాయితో పోలీసులు

మదనపల్లె : దుకాణాల షట్టర్ తొలగించి కాపర్ వైర్, నగదు చోరీ చేసిన నేరంలో అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణం బిందెలోళ్లకాలనీకి చెందిన గుజ్జల ధనకుమార్(36)కు ఎనిమిది నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జీ.సి.ఆసిఫా సుల్తానా బుధవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 20 రోజులు అదనంగా జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో తెలిపారు. ఆ మేరకు నిందితుడిని పోలీసులు సబ్ జైలుకు తరలించారు.

50 గొర్రె పిల్లలు మృతి

తొండూరు : మండలంలోని గంగాదేవిపల్లెలో కుక్కల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతిచెందినట్లు బాధితుడు గుజ్జల గంగయ్య తెలిపారు. గంగయ్య గొర్రెలను మేతకోసం కొండకు తీసుకెళ్లారు. కుక్కలు దాడి చేయడంతో 50 గొర్రెపిల్లలు అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు. మరిన్ని పిల్లలకు గాయాలయ్యాయని, వాటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. తహశీల్దారు బాలనరసింహులు, వెటర్నరీ వైద్యుడు ఖాదర్‌బాషా నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య

బద్వేలు అర్బన్ : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్‌లో మంగళ వా రం రాత్రి మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆ త్మహత్యకు పాల్పడ్డారు. షేక్ ఖాజావలి(52) పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందారు. ఇద్దరు కుమారులు, కుమార్తెకు వివాహం చేశాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసై ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానికులు గమనించి ఆయన కుమారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి గమనించగా అప్పటికే మృతిచెందాడు.

సంక్షేమం చూసి పార్టీలో చేరుతున్నారు

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న షేక్ అల్తాఫ్, అనుచరులు

కలికిరి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని రాజంపేట ఎంపీ పీ.మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కలికిరి, పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఎంపీ, ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో పల్లెవారి పల్లికి చెందిన యర్రయ్యనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, దేవేంద్రనాయుడు, వెంకట్రమణ నాయుడు, గువ్వలతోపుకు చెందిన నరసింహులునాయుడు, శివయ్యనాయుడు, క్రిష్ణనాయుడు, కూచంవారిపల్లికి చెందిన శ్రీనివాసులు నాయుడు, రమణనాయుడు, మణికంఠ నాయుడు, భాస్కర్‌నాయుడు, కుక్కలొడ్డుకు చెందిన మణికుమార్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. వీరితోపాటు కలికిరి పట్టణానికి చెందిన టీడీపీ నేత షేక్ అల్తాఫ్, ఆయన అనుచరులు 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, సీహెచ్‌సీ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, భోగేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి







మృతిచెందిన కృష్ణారెడ్డి, ఉపాధ్యాయుడు సుధాకరనాయక్(ఫైల్), శ్రీనివాసులు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. మదనపల్లె మండలం ఎలకపల్లె కుంటకు చెందిన జి.శేఖర్(34), ఈశ్వరమ్మ కాలనీకి చెందిన కృష్ణారెడ్డి(55)తో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంలో వెళ్తున్నారు. ఈశ్వరమ్మ కాలనీ మిలాన్ ఫంక్షన్ హాల్‌కు చేరగానే వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కృష్ణారెడ్డి బుధవారం ఉదయం మృతిచెందారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో ఉపాధ్యాయుడు..

కలకడ మండలం ఎనుగొండపాలెంకు చెందిన సుధాకరనాయక్(37) పెద్దమండ్యం మండలం సిద్ధవరం పంచాయతీ చింతమానుపల్లె పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ నెల 16న ఎనుగొండపాళెం నుంచి ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తున్నారు. మదనపల్లె మండలంలో పనిచేస్తున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఫైరోజా(31) వలంటీర్ షాహీనా(30) మరో ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. కురబలకోట మండలం రామిగానిపల్లె వద్దకు చేరగానే రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సుధాకరనాయక్‌ను తిరుపతి ఆస్పత్రికి పంపగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని మరొకరు

రాజంపేట : రాజంపేట మండల సరిహద్దులోని అంజన్ గార్డెన్స్ వద్ద బుధవారం బైకు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో శ్రీనివాసులు(35) మృతిచెందారు. బద్వేల్‌కు చెందిన శ్రీనివాసులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వస్త్ర వ్యాపారం నిమిత్తం రైల్వేకోడూరు నుంచి వస్తుండగా ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



రాజేష్ (ఫైల్)

మదనపల్లె : మతి స్థిమితం కోల్పోయిన ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మదనపల్లెలో జరిగింది. చిత్తూరు జిల్లా గంగవరం మండలం జె.కొత్తూరుకు చెందిన మురుగేష్, వళ్లియమ్మ దంపతుల కుమారుడు రాజేష్(24) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయేవాడు. భర్త విడిపోవడంతో తల్లి వళ్లియమ్మ కొడుకు ఆలనాపాలనా చూస్తోంది. ఈ క్రమంలో ఇంటి నుంచి బయటకు వచ్చిన రాజేష్ మదనపల్లె మండలం సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో రైలుపట్టాలపై విగతజీవిగా పడ ఉన్నారు. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించడంతో కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులో ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. గుంతకల్లు–తిరుపతి ప్యాసింజర్ రైలు కిందపడి రాజేష్ ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రహీం తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



గౌరవ వందనం సమర్పిస్తున్న విద్యార్థినులు

కేవీపల్లె : విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి అన్నారు. కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఏపీ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేవీపల్లెలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడలు విజయవంతం చేయడానికి తమ సహకారం ఉంటుందన్నారు. ఎంఈవో మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. పిల్లల్లో మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడలు తోడ్పడుతాయని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీలకు హాజరై మార్చ్‌ఫాస్ట్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, రెడ్డి రమేష్‌బాబు, పచ్చార్ల సుధాకర్, వై.వి.రమణ, రమణమ్మ, పరుశురాముడు, వసంత, రమణారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తున్న బీజేపీ ప్రభుత్వం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కృష్ణా జలాల పునఃపంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో కృష్ణా జలాల పునఃపంపిణీ కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్–సీమ ప్రాజెక్టులపై చర్చ అంశంపై బుధవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అయితే ఎన్నికలు వస్తాయో అక్కడి ఓట్ల కోసం మోదీ ప్రభుత్వం నిధులు కేటాయించి పక్క రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు. గతంలో కర్ణాటకలో ఎన్నికలు వచ్చినపుడు వివాదస్పద అప్పర్ భద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధులు కేటాయించిందన్నారు. ఇపుడు తెలంగాణ ఎన్నికల సమయంలో కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం సబబు కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలుగా కృష్ణా జలాలను కేటాయించిందని, విభజన సమయంలో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇపుడు నీటిని మళ్లిస్తే రాబోవు రోజుల్లో రాయలసీమకు చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ ఎస్.తులసిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎం.ఎ.గఫూర్, బొజ్జా దశరథరామిరెడ్డి, అక్కిని వనజ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఓబులేసు, హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



నిందితులతో సీఐ నారాయణయాదవ్, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కానపల్లెకు చెందిన గుండ్ర మహేశ్వరరెడ్డి, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన కోట సత్యనారాయణ వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారం ముగిసిన అనంతరం వస్త్రాలను మన్నోజిరావు వీధిలోని ఓ గోదాములో ఉంచేవారు. వ్యాపారంలో నష్టపోయి అప్పులు పెరిగిపోవడంతో సత్యనారాయణ గోదాములోని స్నేహితుడి వస్త్రాల సంచులు దోచుకెళ్లారు. పోలీసులు విచారించి అతడితోపాటు ఆటో డ్రైవర్ శివప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. రూ.3.90 లక్షల విలువచేసే వస్త్ర సంచులను సీజ్ చేశారు.

నాలుగు టిప్పర్లు, జేసీబీ స్వాధీనం

సిద్దవటం : మండలంలోని మూలపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలను సీజ్ చేసినట్లు కడప డీఎస్పీ షరీఫ్ తెలిపారు. స్థానిక విలేకరులతో డీఎస్పీ బుధవారం మాట్లాడుతూ పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని జే.పి.కంపెనీ సిబ్బంది సెబ్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సెబ్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలు స్వాధీనం చేసుకుని, నలుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు డ్రైవర్లు పరారయ్యారన్నారు. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ ఉరుకుందమ్మ, ఎస్ఐ పురుషోత్తంబాబు, ఎస్ఐ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు

కడప అర్బన్ : డబ్బు, బంగారం తీసుకురావాలంటూ తనను భర్త, ఆయన కుటుంబీకులు వేధిస్తున్నారని కడప నగరంలోని అహ్మద్ సాబ్ వీధిలో నివాసముంటున్న మాబుషీరా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక మురాదియా నగర్‌కు చెందిన సమీర్‌తో 2022లో మాబుషీరాకు వివాహమైంది. ఇటీవల కొద్ది రోజులుగా డబ్బు, బంగారం తీసుకురావాలని భర్త సమీర్‌తో పాటు మామ జహీర్ అహ్మద్, ఆడ బిడ్డలు, బంధువులు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుర్రంకొండ మండలం దిగువ అమిలేపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు జే.సదాశివ(29) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ములకలచెరువుకు చెందిన మదన్‌మోహన్ భార్య కుమారి(25) కుటుంబ సమస్యలతో బొటిక్స్ మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. నిమ్మనపల్లె మండలం పిట్టావాండ్లపల్లెకు చెందిన మైనర్ బాలిక(15) తల్లి మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనాల ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తురకపల్లెలో నాటు బాంబు కలకలం

పెద్దమండ్యం : మండలంలోని తురకపల్లెలో నాటుబాంబు కలకలం స్థానికులను ఆందోళన రేకెత్తించింది. తురకపల్లె పసలబండకు సమీపంలోని నల్లగుట్ట, వెలిగింటి కొండలలో అడవి పందులు ఎక్కువగా ఉన్నాయి. వేటగాళ్లు నాటుబాంబులు పెట్టి అడవి పందులను మట్టుబెట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కాలనీకి అతి సమీపంలో నాటుబాంబులు పెట్టడంతో కుక్క నోటితో తీసుకోగా పేలి తల ఛిద్రమైంది. దీంతో కాలనీ వాసులు ఉలిక్కిపడ్డారు. గ్రామస్తులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వేటగాళ్లు ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపుల కేసులో జైలుశిక్ష



మహిళను వేధించిన కేసులో నిందితుడు శివాజీ

రాయచోటిటౌన్ : ఓ మహిళను వేధించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రాయచోటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద తీర్పునిచ్చారు. వీరబల్లె మండలానికి చెందిన ఓ మహిళను కడప పట్టణానికి చెందిన మోన్రగుత్తి శివాజీ(26) ఫోన్ ద్వారా అసభ్యకరంగా మాట్లాడడం, ఫొటోలు, వీడియోలు వాయిస్ రికార్డులు పంపుతూ బెదిరించడం చేశారు. ఆ మహిళ 2019లో పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేసిన పోలీసులు కోర్టుకు హాజరు పరిచారు. నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.